ANN తెలుగు

Follow: @ANNTELUGU

24-08-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 219 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏపీ మద్యం రవాణా స్కామ్

మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్


- కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను ఇప్పటికే ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ మంత్రి కుమారుడు కారుమూరి సునీల్ కూడా ఉన్నారు. నిందితులందరూ వైసీపీ హయాంలో ఏపీ లిక్కర్ రవాణాలో అక్రమాలకు పాల్పడినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. కాంట్రాక్టుల ద్వారా రూ.28 కోట్ల వరకు ముడుపులు మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా రాహుల్ గాంధీ

- ఆన్ లైన్ లో వైరల్
- కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు



02

### జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు

- వరంగల్ - ఖమ్మం గ్రాడ్యుయేట్ స్థానం నుండి పోటీ
- పవన్ కల్యాణ్‌కు గడల శ్రీనివాసరావు కృతజ్ఞతలు



02

### జనసేనలోకి కొండా సుస్మిత?

- నేడు నేతలతో భేటీ ప్రచారం
- సీఎం రేవంత్‌పై సుస్మిత వ్యాఖ్యలు సంచలనం
- సురేఖపై కాంగ్రెస్ నేతల తీవ్ర ఆగ్రహం



02




రాజకీయకోణంలోనే

## అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ


- లండన్ పర్యటన విజయవంతం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ కు సీఎం
- నేడు లేదా రేపు మీడియాముందుకు

**హైదరాబాద్, మహా :** రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ పెట్టారు. ''రాజకీయ కారణాల రీత్యా నా అమెరికా పర్యటనకు విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నా. విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు. లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. హైదరాబాద్‌కు వస్తున్నా. అక్కడికి వచ్చాక మిగిలిన అంశాలపై మాట్లాడతా. గత మూడు రోజులుగా పార్టీ, నేతలు, ప్రజల నుంచి లభించిన అద్భుతమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ కు చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం లేదా మంగళవారం మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం అనుమతి నిరాకరణపై ఆయన స్పందించనున్నారు.

**లండన్ లో మీట్ అండ్ గ్రీట్**

ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం, మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసులు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు.


# శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా..!



## జీ.ఓ. 111 కు తూట్లు...!

- నాలా కన్వర్షన్ లేకుండానే యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు...!
- డాక్యుమెంట్ నంబర్ 197/2026లో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్...!
- అంతా జూనియర్ అసిస్టెంట్ 'నజీరుద్దీన్' కనుసన్నల్లోనే...!
- ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డితో కుమ్మక్కై దందాకు తెగబడిన వైనం...!
- అక్రమార్కులకు బ్యాక్‌బోన్‌గా 'ఓ' టీఎన్‌జీఓ నాయకుడు...!
- లేని విల్లాలకు పి టి ఐ ఎన్ నంబర్లు, ఇంటి నంబర్లు కేటాయింపు...!
- పాపంలో పాలు పంచుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు...!
- కోట్ల రూపాయలు చేతులు మారాయంటూ స్థానికంగా జోరుగా సాగుతున్న చర్చ...!
- ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అనుచరులకే రిజిస్ట్రేషన్ చేసామంటూ ఒప్పుకున్న ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్...!
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ దృష్టి సారించాలని స్థానికుల డిమాండ్...!

**శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్** కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారింది.. జీ.ఓ. 111 కు తూట్లు పొడుస్తూ.. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే తప్పకుండా నాలా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది.. కానీ ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్ లు కలిసి రియల్ మాఫియాతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లకు తెగబడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొండుపల్లి వార్డు 119, సర్వే నంబర్లు 211, 212 లకు సంబంధించిన ఓ భారీ అక్రమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నంబర్ 197/2026 జనవరి 7 న జరిగిన డాక్యుమెంటే అక్రమ రిజిస్ట్రేషన్లకు నిలువెత్తు నిదర్శనమంటూ స్థానికంగా బహిరంగ చర్చ జరుగుతోంది..జూనియర్ అసిస్టెంట్ 'నజీరుద్దీన్' కనుసన్నల్లోనే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డితో కలిసి ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండి కొట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులకు బ్యాక్‌బోన్‌గా 'ఓ' టీఎన్‌జీఓ నాయకుడి అండదండలు మెండుగా ఉండటంతో వీరి దందా నిత్యకల్యాణం పచ్చతోరణంలా సాగిందని ఏ ముగ్గురు కలిసినా ఇదే ప్రధాన చర్చగా కొనసాగడం విశేషం.. తామేమీ తక్కువ కాదంటూఈ పాపంలో పాలు పంచుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు లేని విల్లాలకు పీటీఐఎన్ నంబర్లు, ఇంటి నంబర్లు కేటాయించి గురుభక్తిని చాటుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ దందాలో రిజిస్ట్రేషన్ల కోసం కోట్ల రూపాయలు చేతులు మారినట్లు బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అనుచరులకే రిజిస్ట్రేషన్ చేశామంటూ ఆనాటి ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి చెప్పడం కొసమెరుపు.






### కాంగ్రెస్ 1000రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

02

### ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ వ్యూహాలు

నేడు మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం, మీనాక్షి నటరాజన్ జూమ్ సమావేశం

06

తెలంగాణ రక్షణ సేన

### 14 దేశాలకు పార్టీ అధ్యక్షుల నియామకం

మహారాష్ట్రకు కూడా చీఫ్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్).. వివిధ దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్ట్రేలియా (కిషోర్ కత్తి), యూకే (సుమన్ రావు బాల్మూరి)కెనడా (వెంకట్రామన్ మెట్‌పల్లి), యూఏఈ (శేఖర్ గౌడ్ ఆరె) సహా 14 దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. మహారాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కవిత సూచించారు.

### ఖర్గేను కలిసిన కొండా సురేఖ బెంగళూరులో భేటీ

- బెంగళూరులో భేటీ
- ఎయిర్ పోర్ట్ లో ఏఐసీసీ చీఫ్ తో ముచ్చట



ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన తర్వాత

### కొండా సురేఖపై చర్యలు

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



**నిజామాబాద్, మహా :** ఏమైనా సమస్యలు ఉంటే పార్టీలో అంతర్గతంగా చెప్పుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలుంటే చెప్పుకునేందుకు పార్టీలో వివిధ కమిటీలు ఉన్నాయన్నారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేసీ వేణుగోపాల్‌కు చెప్పుకోవచ్చన్నారు. అంతేగానీ పార్టీ లైన్ దాటి బహిరంగ విమర్శలు చేయొద్దని హితవు పలికారు. ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన తర్వాత కొండా సురేఖపై చర్యలు ఉంటాయన్నారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

02




### ఆడె గజేందర్ బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

- పార్టీ బలోపేతానికి గజేందర్ కృషి అభినందనీయం
- ఓటమి తర్వాతా చురుకుగా పనిచేస్తున్న గజేందర్
- ప్రభుత్వ ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి ప్రవేశం
- నిజాయితీ నిబద్ధతతో పార్టీకి అంకితమైన గజేందర్
- కాంగ్రెస్ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

06

# శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా...!




**కె. శ్రీనివాసరావు, స్టేట్ బ్యూరో చీఫ్, మహా డైలీ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ ఆర్ ఓ శంషాబాద్ 1520) కేంద్రంగా ఓ భారీ అక్రమ రిజిస్ట్రేషన్ల కుంభకోణం వెలుగుచూసింది. జంట జలాశయాలైన ఉస్మాన్, హిమాయత్ సాగర్ ల నుండి జంట నగరాలకు త్రాగు నీరు అందించేందుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ సి.అర్జున్ రావు నేతృత్వంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీఓ 111 నిబంధనలకు తూట్లు పొడుస్తూ రియల్ మాఫియా పెట్రేగి పోతోంది. ఈ జీ ఓ 111 ప్రకారం జంట జాలాశయాలకు 10 కిలోమీటర్ల పరిధిలోని 84 గ్రామాల్లో ఎలాంటి లేఅవుట్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, చెక్ డ్యామ్ లు, కాంక్రీట్ వాల్స్ చేపట్టకూడదనే నిషేధాజ్ఞలను తుంగలో తొక్కి, నాలా కన్వర్షన్ అనే ప్రాథమిక ప్రక్రియను సైతం గాలికొదిలేసి కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విల్లాలు, కట్టడాలు లేకపోయినా.. కాగితాలపై మాత్రం 84 విల్లాలు ఉన్నట్లు సృష్టించి యథేచ్ఛగా సాగించిన ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల పర్వం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతోంది.

**కళ్లు బైర్లు కమ్మే లావాదేవీలు .. అసలు ఏం జరిగింది**

వివరాలలోకి వెళ్తే శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామ పరిధిలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించిన అధికారిక రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ లోని వివరాలు పరిశీలిస్తే అధికారుల సాహసం ఎంతటిదో అర్థమవుతుంది. ఈ ఏడాది జనవరి 7, 2026 న (07012026) శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 197/2026 తో ఒక డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ జీపీఏ రిజిస్టర్ అయింది. తొండుపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 211/ఈఈ/1, 211/ఈఈ/2, 212/రు/1/1/1/1/1/1/1, 212/రు/1/1/2, 212/రు/1/1/1/2 సహా పలు సబ్‌డివిజన్లలో విస్తరించి ఉన్న 26,124 చదరపు గజాల భూమిని ఈ డీడ్ పరిధిలోకి తెచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల ప్రకారమే ఈ స్థలం యొక్క అధికారిక మార్కెట్ విలువ అక్షరాలా రూ. 41,68,16,400 (41.68 కోట్లు). కాగా దీని కన్సిడరేషన్ వాల్యూను రూ. 41,68,17,000 గా చూపించారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ వందల కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఈ వివాదాస్పద రిజిస్ట్రేషన్‌కు బేస్‌గా దాదాపు 43 ఏళ్ల హిస్టరీని (1983 నుండి 2026 వరకు) పరిశీలిస్తూ పాత లింక్ డాక్యుమెంట్లను జత చేశారు. ఇందులో ప్రధానంగా 1996 నాటి పాత సేల్ డీడ్లు (డాక్యుమెంట్ నంబర్లు: 1900/1996, 1899/1996) తో పాటు, 2015, 2016, 2017 లో జరిగిన అంతర్గత కుటుంబ సెటిల్‌మెంట్లు, సేల్ డీడ్లను (డాక్యుమెంట్లు: 6205/2015, 3357/2016, 5015/2016, 116/2017) లింక్‌లుగా చూపిస్తూ అత్యంత చాకచక్యంగా చట్టబద్ధత కల్పించారు. ఈ భారీ భూ ఒప్పందంలో ఎగ్జిక్యూటెంట్లుగా రాకేష్ కుమార్ అలియాస్ రాకేష్ గార్గ్, సంజయ్ కుమార్, నంద్ కిషోర్ అగర్వాల్, అశోక్ కుమార్ గార్గ్ వ్యవహరించగా.. ల్యాండ్‌ను దక్కించుకున్న క్లెయిమెంట్‌గా ఎమ్/ఎస్. ఆర్కే మైత్రి సంస్థ నిలిచింది. ఆ సంస్థ తరఫున మేనేజింగ్ భాగస్వాములుగా రాపోలు కృష్ణకుమారి, డాక్టర్ ప్రకాష్‌బాబు వేగుంట సంతకాలు చేశారు.

**జీహెచ్‌ఎంసీ అధికారుల 'చేతివాటం'..**
**లేని విల్లాలకు నంబర్లు జారీ**

ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో పాటు జీహెచ్‌ఎంసీ క్షేత్ర స్థాయి సిబ్బంది (బిల్ కలెక్టర్)తో పాటు డిప్యూటీ కమిషనర్ వరకు సమానంగా పాపంలో పాలు పంచుకున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ 26124 వేల చదరపు గజాల స్థలంలో ఏకంగా 3,78,924 చదరపు అడుగుల బిల్డప్ ఏరియా ఉన్నట్లు డాక్యుమెంట్‌లో పొందు పరిచారు. అంతేకాకుండా.. ప్లాట్ నంబర్ 1 నుండి 84 వరకు విల్లాలు ఉన్నట్లు చూపిస్తూ, వీటికి హౌజ్ నంబర్లు 281/1/A1 నుండి 281/84/A1 వరకు కేటాయించారు.అసలు క్షేత్రస్థాయిలో పునాది రాయి కూడా పడలేదు, కనీసం ఇటుక కూడా పెట్టలేదు.. మరి అలాంటప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారులు వీటికి ప్రాపర్టీ టాక్స్ అసెస్‌మెంట్ నంబర్లు (పి టి ఐ ఎన్ ), డోర్ నంబర్లు ఏ రికార్డుల ఆధారంగా కేటాయించారనేది మిస్టరీగా మారింది. కేవలం రిజిస్ట్రేషన్ సులభం చేయడం కోసమే జీహెచ్‌ఎంసీ అధికారులు భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని ఈ నంబర్లు కేటాయించినట్లు స్పష్టమవుతోంది.

**డాక్యుమెంట్ నంబర్ 197/2026 సూత్రధారి**
**జూనియర్ అసిస్టెంట్ నజీరుద్దీన్.. అండగా**
**ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి!**

ఈ భారీ స్కామ్ వెనుక సూత్రధారి, పాత్రదారి శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న 'నజీరుద్దీన్' కీలక పాత్ర పోషించినట్లు కార్యాలయ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం రాకూడని ఫైళ్లను టేబుల్ దాటించడంలో నజీరుద్దీన్ సిద్ధహస్తుడని, ఆయనకు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి పూర్తిస్థాయిలో సహకరించారని సమాచారం. వీరిద్దరికీ తోడుగా, రిజిస్ట్రేషన్ల శాఖలో బలమైన పట్టున్న ఒక టీఎన్‌జీఓ సంఘం అగ్రనేత బ్యాక్‌బోన్‌గా నిలిచారని, ఉన్నతాధికారుల నుండి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆయనే మేనేజ్ చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై స్థానిక సామాజిక కార్యకర్తలు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డిని నిలదీయగా.. "మేము కావాలని చేయలేదు, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అనుచరులు ఒత్తిడి తెస్తేనే ఈ రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చింది" అంటూ నోరు జారడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర కలకలం రేపుతోంది.


**ఏసీబీ, విజిలెన్స్ విచారణకు స్థానికుల డిమాండ్:**

ప్రభుత్వ నిబంధనలను, పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కి, నాలా కన్వర్షన్ ఫీజులు ఎగ్గొట్టి, లేని విల్లాల పేరిట జీహెచ్‌ఎంసీ పి టి ఐ ఎన్, ఇంటి నంబర్లతో సాగిన ఈ భారీ కుంభకోణంలో వందల కోట్లు చేతులు మారాయని తొండుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల కమిషనర్ తక్షణమే స్పందించి ఈ డాక్యుమెంట్ నంబర్ 197/2026 పై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగితే శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత సంవత్సరం డిసెంబర్ నుండి ఈ సంవత్సరం జనవరి 17 వరకు జరిగిన రిజిస్టర్డ్ డాకుమెంట్స్ ని పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్లు బయటపడే అవకాశముందని వారు స్పష్టం చేస్తున్నారు.










After obtaining permission, the Parties of the First Party Nos. 1 and 2 committed to develop the project. Subsequently, the Parties of the First Party Nos. 3 and 4 were also continuing the required to continue the development using their own funds. Construct independent Houses and Concerned authority have allotted each permission have independent house number and sanctioned plan of entire houses of above said land and allocation of house number of individual as follows:-

| VILLA NO | HOUSE NO. | PTIN NO | SQ. YARDS | SQ.FEETS |
| --- | --- | --- | --- | --- |





b) Dr. PRAKASH BABU VEGUNTA S/o Sri V.V.N. Prasad, Aged about: 62 Years, Occ : Doctor, R/o Flat No.1101, C Block, My Home Abhra Opposite Inorbit Mall, Gachibowli, Serilingampally, R.R. District, T.G.

"Hereinafter referred to as "DEVELOPER" which term unless repugnant to the context shall mean and include all its partners, legal representatives, heirs, executors, administrators, successors-in-office & interest, assigns and nominees etc., of the SECOND PART"

# 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా రాహుల్ గాంధీ

**ఆన్ లైన్ లో వైరల్**
**కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు**

**ఢిల్లీ, మహా :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని "రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్"గా చిత్రీకరిస్తూ జాతీయ రాజధానిలోని భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో రాహుల్ గాంధీ చిత్రంతో పాటు "ది సైలెంట్ గార్డియన్, ఎ వాచ్‌ఫుల్ ప్రొటెక్టర్, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్" అనే ట్యాగ్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల ప్రారంభంలో రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లో విద్యార్థులు, యువ పౌరులతో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి సరదాగా "మీరు బ్యాట్ మ్యాన్ ఆ?" అని ప్రశ్నించారు. దీనికి రాహుల్ స్పందిస్తూ, "బ్యాట్ మ్యాన్, తాను ఒకే గదిలో ఎప్పుడూ లేమని అందరూ అనుకుంటున్నారులే" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. రాహుల్ గాంధీ చేసిన ఈ సరదా వ్యాఖ్య ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.




విద్యార్థులు దీనిపై పలు మీమ్స్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల ఆయనను 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా పేర్కొంటూ పోస్టర్లు ఏర్పాటు చేశారు.

# జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు




**వరంగల్ - ఖమ్మం గ్రాడ్యుయేట్ స్థానం నుండి పోటీ**

**వరంగల్ బ్యూరో మహా ;** ఉమ్మడి ఖమ్మంనల్లగొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా మాజీ హెల్త్ డైరెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం కు చెందిన డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును ముందస్తుగా ప్రకటించింది. ప్రస్తుతం ఆయన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయిలో పనిచేసిన ఆయనకు వైద్య రంగంలో సేవలందించిన అనుభవం ఉంది. జనసేన జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ .. గడల శ్రీనివాసరావు పేరును పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు ప్రతిపాదించారు. ఆయన అభ్యర్థిత్వానికి పవన్ కల్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో పార్టీ ముందస్తుగా పేరును ప్రకటించినట్లు జనసేన వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపిస్తానన్నారు. వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని కోరారు.తన పై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించిన పవన్ కల్యాణ్, రామ్ తాళ్లూరి, శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకుని తెలంగాణలో జనసేన పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# జనసేనలోకి కొండా సుస్మిత?

**నేడు నేతలతో భేటీ ప్రచారం**

**హైదరాబాద్, మహా :** జనసేనలోకి కొండా సుస్మిత వెళ్ళనుందనే ప్రచారం జోరందుకుంది. సోమవారవ జనసేన కీలక నేతలతో కొండా సుస్మిత భేటీ అవనుందని చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారగా, మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా తెగదెంపులకు సిద్ధపడే కూతురికి మద్దతుగా నిలుస్తోందని, గతంలోనే ఇలాంటి వ్యాఖ్యలు రిపీట్ కావని చెప్పి ఇపుడు సీఎం టార్గెట్ గా విమర్శలు చేయడంపై పార్టీలో ఎవరూ అంగీకరించడం లేదు. దీంతో ముందుగా తనకు, తన తల్లికి సంబంధం లేదని చెప్పేందుకు జనసేన నేతలతో భేటీ వ్యూహం ఎంచుకున్నట్లు చెబుతున్నారు.



# కాంగ్రెస్ 1000రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి



**హైదరాబాద్, మహా :** అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.. వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి.. తర్వాత అన్నివర్గాల ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి 1,000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వచ్చే నెల 2 నుంచి వారం రోజులపాటు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అర్ధరాత్రి నుంచి ఆటో.. క్యాబ్.. స్కూల్ వ్యాన్ల బంద్

**ఎన్నికల హామీలు అమలు చేయలేదంటూ 18 సంఘాల జేఏసీ ఆగ్రహం.**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల ఆందోళన తీవ్రరూపం దాల్చింది. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తూ 18 సంఘాలతో కూడిన జేఏసీ ఆదివారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్ సోమవారం కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్లు నిలిచిపోవడంతో సాధారణ రవాణాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో రోజువారీ ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, ఆటో, క్యాబ్, ప్రైవేటు రవాణా కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ఏపీ మద్యం రవాణా స్కామ్

( మొదటి పేజీ తరువాయి )

తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. కుంభకోణం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. సిగ్మా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు మద్యం రవాణాలో అక్రమాలు జరిగినట్లు.. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌కు కాంట్రాక్టులు ఇప్పించేందుకు రూ.28 కోట్ల ముడుపులు తీసుకున్నట్లు అధికారులు ఆధారాలు సేకరించారు. రవాణా ద్వారా వచ్చిన ఆదాయంలో 96 శాతం సిండికేట్ ఖాతాలకు వెళ్లగా.. సిగ్మా సంస్థకు 4 శాతం ముడుపులు మళ్లించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

# ఖర్గేను కలిసిన కొండా సురేఖ బెంగళూరులో భేటీ

**ఎయిర్ పోర్ట్ లో బిజెపి చీఫ్ తో ముచ్చట**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ను కలవడం ఆసక్తికరంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరులో ఖర్గేతో సురేఖ భేటీ అయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగింది. కొండా సురేఖ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఖర్గేకు వివరించినట్లు తెలుస్తోంది. కూతురు వ్యాఖ్యలు, ఆ తర్వాత పరిణామాల గురించి ఆమె ఖర్గేకు వివరించారు. కొండా సురేఖ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల అపాయింట్ మెంట్ కోరినా ఎవరూ స్పందించకపోవడంతో నేరుగా ఖర్గేను కలిశారు. ఈ సందర్భంగా ఖర్గే సుస్మిత వ్యాఖ్యలపై ఆరా తీశారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడటం సరికాదని కొండా సురేఖకు సూచించారు. కొండా సురేఖ బెంగళూరు పర్యటనలో మరో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎయిర్ పోర్ట్‌లో కొండా సురేఖ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావుకు తారసపడ్డారు. ఈ క్రమంలో ఆమె బెంగళూరు పర్యటన గురించి రామచందర్ రావుతో చెప్పుకున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు సురేఖకు సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ సమయంలో ఆమె ఖర్గేను కలవడం, బీజేపీ నేతలతో తన వ్యక్తిగత పర్యటన వివరాలు షేర్ చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ వ్యూహాలు

**నేడు మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం, మీనాక్షి నటరాజన్ జూమ్ సమావేశం**

**హైదరాబాద్, మహా:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పై తెలంగాణ కాంగ్రెస్ మరింత దృష్టి సారించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కలిసి సోమవారం సాయంత్రం 5.30 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో జూమ్ సమావేశం నిర్వహించనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడడం, కొత్తగా అర్హత పొందినవారిని జాబితాలో చేర్పించడం, బూత్ స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వంటి అంశాలు సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ గత కొంతకాలంగా ఎస్ఐఆర్ ప్రక్రియను రాజకీయంగా కీలక అంశంగా పరిగణిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసి ఓటర్ల జాబితాను పరిశీలించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర ఎన్నికల ప్రక్రియల నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రాధాన్యం మరింత పెరిగింది.



# నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం

**టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

**నిజామాబాద్, మహా :** జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తెలంగాణ యూనివర్సిటీ, కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో మెడికల్ కాలేజీలు వచ్చాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంజినీరింగ్, వ్యవసాయ కళాశాలలను తీసుకొచ్చామని, ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు. లింబాద్రి గుట్టపై గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు నిజామాబాద్ జిల్లాకు మంజూరయ్యాయని తెలిపారు. హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించామని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. సహకార సంఘాల్లో పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు కల్పిస్తామని తెలిపారు. నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించినట్లు వెల్లడించారు. బీజేపీ నేతలు నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా కూడా అభివృద్ధి చేయలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. కొందరు నేతలు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆర్మూర్‌లో పామాయిల్ పరిశ్రమ రాబోతుందని, వ్యవసాయ రంగంలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మేటి జిల్లాగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నగేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ తాహెర్‌బిన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | సోమవారం, హైదరాబాద్ | 24-08-2026
ANN తెలుగు



# తిరుమలలో భక్తుల రద్దీ

- 22 కంపార్టుమెంట్లలో వేచిచూపులు
- సర్వదర్శనానికి ఎనిమిది గంటలు.
- ఒక్కరోజే 84,873 మంది దర్శనం

**తిరుమల, మహా.:** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. వారాంతం కావడంతో కొండపైకి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 22 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు ఎనిమిది గంటల సమయం పడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లలో తాగునీరు, అన్నప్రసాదం, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

శనివారం శ్రీవారిని 84,873 మంది భక్తులు దర్శించుకున్నారు. 36,286 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ.3.67 కోట్ల ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తిరుమలలో ఆగస్టు 23 నుంచి 25 వరకు వార్షిక పవిత్రోత్సవాలు కూడా జరగనున్నాయి. ఆగమ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ ఉత్సవాలకు సంబంధించి టీటీడీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది.ప్రస్తుతం దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యలో రోజువారీ హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ వారాంతాలు, పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో రద్దీ ఒక్కసారిగా పెరగడం సాధారణంగా మారింది. దీంతో టోకెన్ లేని భక్తులకు వేచి ఉండే సమయం కూడా పెరుగుతోంది. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, కొండపై వసతి, రవాణా, అన్నప్రసాదం తదితర సౌకర్యాలను సమన్వయం చేయడం టీటీడీకి కీలకంగా మారింది. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాలపై కొరడా

- సాజిద్‌ఖాన్ అరెస్టు.
- మరో ఆరు అంతస్తుల భవనంపై కూల్చివేతకు రంగం సిద్ధం.

**హైదరాబాద్, మహా.:** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి సాజిద్‌ఖాన్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఆయన నిర్మించినట్లు గుర్తించిన అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులు దృష్టి సారించారు. ఇదే సమయంలో మరో ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేయడం గచ్చిబౌలి పరిణామాలకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. భారీ కూల్చివేత యంత్రాన్ని ఇప్పటికే ఘటనాస్థలికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కేవలం అక్రమ నిర్మాణదారులపైనే కాకుండా నిర్మాణాలకు అనుమతులు ఎలా లభించాయి? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్న సమయంలో సంబంధిత విభాగాలు ఎందుకు స్పందించలేదు? అనే ప్రశ్నలపైనా అధికార యంత్రాంగం దృష్టి సారించింది.గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రామ్‌గూడ తదితర ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో భవన అనుమతులు, భూ వినియోగ మార్పులు, నిర్మాణ నిబంధనల అమలుపై ప్రశ్నలు తరచూ తలెత్తుతున్నాయి. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే భవిష్యత్తులో రహదారులు, డ్రైనేజీ, పార్కింగ్, అగ్నిమాపక భద్రత వంటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరగనున్నట్లు సమాచారం. తాజా కూల్చివేతలు హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరికి సంకేతంగా కనిపిస్తున్నాయి.



# మోదీ@25’పై బీజేపీ మథనం

- రాష్ట్రాల అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలతో వరుస సమావేశాలు.
- దేశవ్యాప్త ప్రచారానికి ప్రణాళిక.

**ఢిల్లీ,మహా.:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాలకు బీజేపీ సిద్ధమవుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో కొత్తగా నియమితులైన జాతీయ కార్యవర్గంతో సమావేశాలు నిర్వహిస్తున్న పార్టీ, రాష్ట్రాల అధ్యక్షులు, సంస్థాగత ఇన్‌ఛార్జిలతోనూ చర్చలు జరుపుతోంది. మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సాగించిన 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ప్రారంభమైన ఆయన పాలనా ప్రస్థానం 2014లో ప్రధానమంత్రి పదవికి చేరింది. అప్పటి నుంచి వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ నాయకత్వాన్ని పార్టీ తన ప్రధాన రాజకీయ బలంగా ప్రదర్శిస్తోంది. మౌలిక వసతులు, డిజిటల్ పాలన, సంక్షేమ పథకాలు, విదేశాంగ విధానం, రక్షణ, అంతరిక్షం, ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రచారంలో ప్రధాన అంశాలుగా తీసుకురావాలని పార్టీ భావిస్తోంది.ఇదే సమయంలో రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపైనా బీజేపీ దృష్టి సారిస్తోంది. యువతతో అనుసంధానం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, సామాజిక మాధ్యమాల ప్రచారం, బూత్ స్థాయి వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు సమావేశాల్లో చర్చకు వస్తున్నాయి. ‘మోదీ@25’ను కేవలం వార్షికోత్సవ కార్యక్రమంగా కాకుండా దీర్ఘకాలిక రాజకీయ ప్రచారంగా మలచాలని పార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. దేశంలోని ప్రతి రాష్ట్రంలో మోదీ పాలనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా చేరాయన్నదాన్ని వివరించేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయి.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

- ‘సేవా సంకల్ప్ అభియాన్’ను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలి: పొంగులేటి సుధాకర్‌రెడ్డి.



**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలనా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ‘సేవా సంకల్ప్ అభియాన్’ను ప్రజాసేవ, సుపరిపాలన, అభివృద్ధి, అంత్యోదయ స్ఫూర్తిని ప్రతిబింబించే మహత్తర ప్రజా ఉద్యమంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు-కర్ణాటక జాతీయ సహ ఇన్‌చార్జి డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో జరిగిన విస్తృత స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశంలో ఈ కార్యక్రమ కార్యాచరణపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహిస్తున్న నేటి వరకు మోదీ రాజకీయ ప్రస్థానానికి సేవ, సుపరిపాలన, అభివృద్ధి, అంత్యోదయమే మూలస్తంభాలుగా నిలిచాయని సుధాకర్‌రెడ్డి అన్నారు. గుజరాత్ నుంచి ఢిల్లీ వరకు ఆయన ప్రయాణం కేవలం పదవుల ప్రస్థానం కాదని, లభించిన ప్రతి బాధ్యతను ప్రజాసేవకు సాధనంగా మార్చిన 25 ఏళ్ల తపస్సు అని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న సంకల్పమే ఆయన పాలనా విధానానికి ఆత్మ అని వివరించారు.సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే అభియాన్‌లో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వృత్తి నిపుణులతో పాటు సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం, లబ్ధిదారులతో ప్రత్యక్ష సంప్రదింపులు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు మోదీ నాయకత్వంలో దేశంలో చోటుచేసుకున్న మార్పులను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.

దేశ పరివర్తన కథను కొత్త తరానికి వాస్తవాలు, గణాంకాలు, లబ్ధిదారుల అనుభవాలు, ప్రజాసేవ ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. పేదల జీవితాల్లో పాలన తీసుకొచ్చిన మార్పు, మౌలిక సదుపాయాల విస్తరణ, పేదరిక నిర్మూలన, ప్రపంచ వేదికపై భారత్ స్థానం బలోపేతం వంటి అంశాలను యువతకు వివరించాల్సి ఉందన్నారు. రాజకీయాలు అంటే కేవలం అధికారం కాదని, సేవ, బాధ్యత, దేశ నిర్మాణం అనే భావనను యువతలో బలపరిచే కార్యక్రమంగా ‘సేవా సంకల్ప్ అభియాన్’ నిలవాలని ఆకాంక్షించారు.

**రాహుల్, ఖర్గేలకు ఘాటు కౌంటర్**

కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే రాజకీయ వైఖరిపై సుధాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల్లో ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల అనుమానాలు, అపనమ్మకాలు పెంచేలా కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే బీజేపీ లక్ష్యమని, అభివృద్ధి, ఆకాంక్షలు, అవకాశాలపై తాము మాట్లాడుతుంటే కాంగ్రెస్ ఆరోపణలు, ప్రతికూలత, రాజకీయ అనుమానాల చుట్టూ తిరుగుతోందని విమర్శించారు.ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు మాత్రమే కాక ప్రజాస్వామ్యానికి అవసరమని, అయితే ప్రభుత్వంపై రాజకీయ వ్యతిరేకత దేశంపై నిరంతర నిరాశావాద ప్రచారంగా మారకూడదని అన్నారు. రాహుల్‌గాంధీకి మోదీని రాజకీయంగా వ్యతిరేకించే స్వేచ్ఛ ఉందని, కాంగ్రెస్‌కు బీజేపీని ప్రశ్నించే హక్కు ఉందని పేర్కొంటూనే, ప్రతి వ్యవస్థపైనా అనుమానాలు సృష్టించడం, అర్ధసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయదని వ్యాఖ్యానించారు.

**అభివృద్ధిపై చర్చకు రావాలి**

కాంగ్రెస్ నాయకత్వానికి సుధాకర్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మౌలిక సదుపాయాలు, ఆర్థిక సమ్మిళితం, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, తాగునీరు, ఆరోగ్యం, డిజిటల్ విప్లవం, మహిళా సాధికారత, జాతీయ భద్రత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై కాంగ్రెస్ తన రికార్డును, బీజేపీ తన రికార్డును ప్రజల ముందు ఉంచాలని సూచించారు. తుది తీర్పును ప్రజలకే వదిలేద్దామని అన్నారు.

ప్రతిపక్షం తన రాజకీయ శక్తిని ఒక వ్యక్తిని వ్యతిరేకించడానికే వినియోగిస్తుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన శక్తినంతా 140 కోట్ల మంది భారతీయుల సేవకు అంకితం చేస్తున్నారని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతికూల రాజకీయాలకు తమ సమాధానం సేవ అని, తప్పుడు ప్రచారానికి వాస్తవాలే సమాధానమని, విభజన రాజకీయాలకు ‘సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్’తో జవాబిస్తామని స్పష్టం చేశారు.

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ‘సేవా సంకల్ప్ అభియాన్’లో బీజేపీ కార్యకర్తలతో పాటు ప్రజలు, ముఖ్యంగా యువత పెద్దఎత్తున భాగస్వాములు కావాలని సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ‘సేవ-సంకల్పం-ప్రజా భాగస్వామ్యం’ స్ఫూర్తితో ఈ నెల రోజుల కార్యక్రమాన్ని వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధన దిశగా మహత్తర ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్‌లో లేఖల కలకలం

- క్రమశిక్షణ కమిటీకి కొండా సురేఖ మరో లేఖ.
- మళ్లీ భేటీ కానున్న కమిటీ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరింత ముదురుతోంది. పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఆమె మరో లేఖ రాశారు. ఇప్పటికే ఆమె నుంచి ఒక వివరణ అందగా తాజాగా రెండో లేఖ కూడా రావడంతో వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. రెండు లేఖలను పరిశీలించి కమిటీ తదుపరి సమావేశంలో చర్చిస్తామని కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. కొండా సురేఖ తనపై, తన కుటుంబంపై కొందరు పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనపై జరుగుతున్న ప్రచారం వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయన్న అనుమానాన్ని ఆమె వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా విచారణ జరిపి అసలు కారణాలను గుర్తించాలని ఆమె పార్టీ క్రమశిక్షణ కమిటీని కోరినట్లు తెలుస్తోంది.ఇదే సమయంలో మంత్రి సురేఖ కుటుంబానికి సంబంధించిన వ్యాఖ్యలు, పార్టీ నాయకుల మధ్య పరస్పర ఆరోపణలు కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను బహిర్గతం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ వ్యవహారం మరింత వేడెక్కడం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. క్రమశిక్షణ కమిటీ వివిధ నేతల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వీడియోలు, వివరణలను పరిశీలిస్తోంది.కమిటీ తక్షణ చర్య తీసుకోకుండా మరింత సమాచారం సేకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో కొండా సురేఖ, చిన్నారెడ్డి తదితరుల వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఉత్కంఠగా మారింది. పార్టీ వేదికలపైనే అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం ఇస్తున్నప్పటికీ, వరుసగా బయటకు వస్తున్న ఆరోపణలు కాంగ్రెస్ క్రమశిక్షణ వ్యవస్థకు సవాలుగా మారాయి.



# టాక్సిక్’ వేడుకలో ప్రమాదం

- సౌండ్ సిస్టమ్ కూలి గాయాలు.. మల్లారెడ్డి యూనివర్సిటీ, నిర్వాహకులపై కేసు

**హైదరాబాద్, మహా.:** కన్నడ నటుడు యశ్ నటించిన ‘టాక్సిక్’ చిత్ర ప్రీరిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. భారీగా అభిమానులు, విద్యార్థులు తరలివచ్చిన కార్యక్రమంలో సౌండ్, లైటింగ్ ఏర్పాట్లకు సంబంధించిన నిర్మాణం కూలిపోవడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు రావడంతో ప్రాంగణంలో జనసందోహం పెరిగింది. ఇదే సమయంలో సౌండ్ సిస్టమ్ నిర్మాణంలో భాగం కూలడంతో ప్రమాదం చోటుచేసుకుంది. నలుగురికి గాయాలైనట్లు నివేదికలు వెల్లడించాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు.ఈ ఘటనలో కార్యక్రమ నిర్వాహకులు, మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భారీ జనసందోహం ఉంటుందని ముందే తెలిసినప్పటికీ భద్రతా ఏర్పాట్లు, నిర్మాణాల స్థిరత్వం, అత్యవసర మార్గాలు, జన నియంత్రణ చర్యలు తగిన స్థాయిలో చేపట్టారా అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.సినీ కార్యక్రమాలకు వేలాది మంది అభిమానులు తరలివస్తున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చిన్నపాటి లోపం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని తాజా ఘటన మరోసారి స్పష్టం చేసింది. కార్యక్రమ నిర్వాహకుల బాధ్యత, విద్యాసంస్థ ప్రాంగణంలో భారీ వాణిజ్య కార్యక్రమాలకు అనుమతుల ప్రక్రియ, పోలీసుల సమన్వయం వంటి అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

# చిన్నారెడ్డి వివరణపై మేఘారెడ్డి అసంతృప్తి

- ఆడియో, వీడియో ఆధారాలు కమిటీకి ఇచ్చా. చర్యలు తప్పవు: ఎమ్మెల్యే



హైదరాబాద్, మహా.: కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత వివాదానికి మరో మలుపు తిరిగింది. చిన్నారెడ్డి ఇచ్చిన వివరణపై తాను సంతృప్తి చెందలేదని వనపర్తి ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి తెలిపారు. చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై పార్టీ చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.తాను క్రమశిక్షణ కమిటీకి ఆడియో, వీడియో ఆధారాలను సమర్పించినట్లు మేఘారెడ్డి వెల్లడించారు. కమిటీ మరోసారి తనను పిలిస్తే పూర్తి వివరాలతో తన వాదనను వినిపిస్తానన్నారు. చిన్నారెడ్డి వివరణలో వాస్తవాలు లేవని, మొత్తం అబద్ధాలేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. చిన్నారెడ్డి బీఆర్ఎస్ నేతలతో సన్నిహితంగా ఉంటున్నారని కూడా మేఘారెడ్డి ఆరోపించారు. ఈ వివాదం ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. మేఘారెడ్డి పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేసినట్లు కూడా సమాచారం.మరోవైపు చిన్నారెడ్డి తనపై వచ్చిన క్రమశిక్షణ నోటీసును ఉపసంహరించుకోవాలని పార్టీ కమిటీని కోరినట్లు సమాచారం. తాను దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో ఉన్నానని, తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చినందున వ్యవహారాన్ని ముగించాలని ఆయన కోరారు. ఇద్దరి మధ్య విభేదాలు బహిరంగ స్థాయికి చేరడంతో పార్టీ నాయకత్వం ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయం ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా? లేక మరింత రాజకీయ దుమారం రేపుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# బంగాళాఖాతంలో ‘ఓషన్ విన్నర్’ మునక

- 24 మంది సిబ్బందిలో ఇద్దరి రక్షణ.
- మిగిలిన 22 మంది కోసం నేవీ గాలింపు

**విశాఖపట్నం, మహా.:** బంగాళాఖాతంలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ సరకు నౌక ‘ఎంవీ ఓషన్ విన్నర్’ మునిగిపోవడంతో భారీ స్థాయి గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా ఇద్దరిని రక్షించారు. మిగిలిన 22 మంది కోసం భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సంయుక్తంగా గాలింపు చేపడుతున్నాయి.ఒడిశాలోని పారాదీప్ నుంచి ఇనుప ఖనిజంతో చైనా వైపు వెళ్తున్న నౌక నుంచి అత్యవసర సందేశం రావడంతో భారత భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. అనంతరం నౌకతో సంబంధాలు తెగిపోయాయి. సముద్రంలో నౌక మునిగిపోయినట్లు నిర్ధారణ కావడంతో రెస్క్యూ ఆపరేషన్‌ను వేగవంతం చేశారు.నౌకలో 20 మంది చైనా పౌరులు, ముగ్గురు మయన్మార్ పౌరులు, ఒక బంగ్లాదేశ్ పౌరుడు ఉన్నట్లు సమాచారం. రక్షించిన ఇద్దరికి వైద్యసాయం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో నౌకాదళ నిఘా విమానాలు, నౌకలు, కోస్ట్‌గార్డ్ బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. సమీపంలోని వాణిజ్య నౌకలను కూడా సహాయక చర్యల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు.సముద్రంలో వాతావరణ పరిస్థితులు, అలల తీవ్రత, నౌక మునిగిన లోతు రెస్క్యూ ఆపరేషన్‌కు సవాలుగా మారుతున్నాయి. అయినప్పటికీ ప్రాణాలతో ఉన్నవారిని గుర్తించి రక్షించడమే ప్రధాన లక్ష్యంగా నేవీ, కోస్ట్‌గార్డ్ బృందాలు పనిచేస్తున్నాయి. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది సహాయక చర్యలు పూర్తయిన తర్వాత దర్యాప్తులో తేలనుంది.



# ప్రాంక్ మెసేజ్‌తో బెట్టింగ్ ముఠా గుట్టురట్టు.

- ‘నన్ను కిడ్నాప్ చేశారు’ అంటూ ప్రియురాలికి మెసేజ్.
- పోలీసులకు రూ.30 లక్షల నగదు.

హైదరాబాద్, మహా.: ప్రియురాలికి ఓ యువకుడు చేసిన ప్రాంక్ మెసేజ్ చివరకు క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును బయటపెట్టింది. తనను కిడ్నాప్ చేశారంటూ యువకుడు ప్రియురాలికి సందేశం పంపడంతో ఆమె ఆందోళనకు గురై 112కు ఫోన్ చేసింది. యువతి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కేపీహెచ్‌బీలోని ఓ ఫ్లాట్‌కు చేరుకుని తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.30 లక్షల నగదు లభించినట్లు సమాచారం. ఫ్లాట్‌లో మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించగా క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన లావాదేవీలు, సమాచార మార్పిడి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. నగదు కూడా బెట్టింగ్ కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.కిడ్నాప్ జరిగిందన్న సమాచారంతో పోలీసులు హుటాహుటిన స్పందించకపోయి ఉంటే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక వ్యక్తి చేసిన సరదా సందేశం పోలీసులను అనూహ్యంగా బెట్టింగ్ కేంద్రానికి తీసుకెళ్లింది.స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల్లోని సమాచారాన్ని విశ్లేషిస్తూ పోలీసులు ముఠాలోని ఇతర సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. బెట్టింగ్ నెట్‌వర్క్ ఎక్కడి నుంచి నడుస్తోంది? నగదు ఎవరికి చేరుతోంది? ఆన్‌లైన్ ఖాతాలు, బ్యాంకు లావాదేవీలు ఎలా సాగుతున్నాయి? అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. నగరంలో క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు నిఘా పెంచుతున్న సమయంలో ఈ ఘటన వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



## భారీ బడ్జెట్ లేకుండానే బాక్సాఫీస్ షేక్

సినిమా విజయానికి భారీ బడ్జెట్, స్టార్ హీరోలు, కోట్ల రూపాయల ప్రచారం తప్పనిసరి కాదని చైనాకు చెందిన యానిమేషన్ చిత్రం 'నియు లాయ్' (Niu Lai) నిరూపిస్తోంది. పరిమిత వనరులతో రూపొందిన ఈ చిన్న సినిమా.. తొలుత ఎలాంటి ఆదరణ పొందకపోయినా, సోషల్ మీడియాలో అనూహ్యంగా వైరల్ కావడంతో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం చైనా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం భారీ వసూళ్లvను సాధిస్తూ చర్చనీయాంశంగా మారింది.ఆగస్టు 5న చైనాలోని థియేటర్లలో విడుదలైన 'నియు లాయ్'కు ప్రారంభంలో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. విడుదలైన మొదటి పది రోజుల్లో ఈ చిత్రం కేవలం 10 వేల యువాన్లు మాత్రమే రాబట్టినట్లు స్థానిక బాక్సాఫీస్ గణాంకాలు వెల్లడించాయి. కొన్ని రోజుల్లో రోజువారీ వసూళ్లు 200 యువాన్లకే పరిమితమైనట్లు సమాచారం. దీంతో ఈ సినిమా పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని భావించారు. అయితే ఆ తర్వాత పరిణామాలు అనూహ్యంగా మారిపోయాయి. సినిమాలోని యానిమేషన్ శైలి, విభిన్నమైన విజువల్స్, కథనం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ప్రేక్షకుల కామెంట్లు, విమర్శలు, సినిమా క్లిప్స్, మీమ్స్, రియాక్షన్ వీడియోలు విస్తృతంగా వైరల్ కావడంతో 'నియు లాయ్'కు ఉచిత ప్రచారం లభించింది. సినిమా గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరగడంతో థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య కూడా క్రమంగా పెరిగింది. ఈ ఆసక్తి బాక్సాఫీస్ వసూళ్లపై స్పష్టమైన ప్రభావం చూపించింది. ఆగస్టు 20 నాటికి ఈ చిత్రం చైనా మార్కెట్‌లో 4 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసినట్లు రాయిటర్స్ నివేదికలను ఉటంకిస్తూ పలు కథనాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా రోజువారీ బాక్సాఫీస్ ర్యాంకింగ్స్‌లో హాలీవుడ్ చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తర్వాతి స్థానంలో నిలవడం ఈ చిన్న చిత్రానికి లభించిన ఆదరణను తెలియజేస్తోంది. ఇక 'నియు లాయ్' నిర్మాణ వ్యయం కూడా ఆసక్తికరంగా మారింది. కొన్ని నివేదికల్లో ఈ యానిమేషన్ చిత్రాన్ని కేవలం 200 డాలర్ల బడ్జెట్‌తో రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మరికొన్ని కథనాలు నిర్మాణానికి కొన్ని వేల డాలర్లు ఖర్చయ్యాయని చెబుతున్నాయి. అందువల్ల 200 డాలర్ల బడ్జెట్ అనే సంఖ్యను అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అమేచ్యూర్ యానిమేటర్ షిన్ యుమెంగ్, ఆయన తల్లి సన్ లిఫాంగ్ కలిసి సుమారు ఐదేళ్లపాటు ఈ ప్రాజెక్టుపై పనిచేసినట్లు సమాచారం. పెద్ద యానిమేషన్ స్టూడియో, ప్రముఖ నటీనటులు, భారీ సాంకేతిక బృందం లేకుండానే ఈ చిత్రాన్ని రూపొందించడం ఇప్పుడు ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది. 'నియు లాయ్' విజయం సినిమా నిర్మాణంలో బడ్జెట్ కంటే కంటెంట్, ప్రేక్షకుల ఆసక్తి ఎంత కీలకమో మరోసారి చాటిచెబుతోంది. మొదట్లో ఎవరూ పట్టించుకోని చిత్రం.. సోషల్ మీడియా ద్వారా ఒక్కసారిగా వైరల్ కావడంతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా చూపిస్తోంది. మంచి కంటెంట్‌కు ప్రేక్షకులే ప్రచారకర్తలుగా మారితే చిన్న సినిమా కూడా భారీ విజయాన్ని అందుకోగలదనే విషయానికి ఈ చిత్రం తాజా ఉదాహరణగా నిలుస్తోంది.

## అన్ని భాషల్లోనూ రుక్మిణి హవా

కన్నడ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్.. ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో బిజీ హీరోయిన్‌గా మారారు. సహజమైన నటన, భావోద్వేగాలను అద్భుతంగా పలికించే అభినయం, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె.. కన్నడతో పాటు తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు.2019లో వచ్చిన కన్నడ థ్రిల్లర్ చిత్రం 'బిర్బల్'తో రుక్మిణి వసంత్ సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత 2023లో విడుదలైన 'సప్త సాగరదాచే ఎల్లో: సైడ్ ఏ', 'సైడ్ బీ' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఈ రొమాంటిక్ డ్రామాల్లో ఆమె కనబరిచిన నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అంతేకాకుండా ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డ్స్‌లో ఉత్తమ నటి - కన్నడ విభాగంలో పురస్కారం అందుకుని తన ప్రతిభను చాటుకున్నారు.ఆ తర్వాత 'బాణదారియల్లి' చిత్రంలోనూ రుక్మిణి తన నటనతో ఆకట్టుకున్నారు. 2024లో 'బఘీరా', 'భైరతి రణగల్' వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మరింత గుర్తింపు పొందారు. విభిన్న కథలు, బలమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్తున్నారు.తెలుగు చిత్ర పరిశ్రమలోకి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో రుక్మిణి వసంత్ అడుగుపెట్టారు. అనంతరం తమిళ సినీ రంగంలోకి 'ఏస్', 'మధరాసి' చిత్రాలతో ప్రవేశించారు. 2025లో విడుదలైన 'కాంతారా: చాప్టర్ 1' భారీ విజయాన్ని అందుకోవడంతో ఆమె క్రేజ్ దక్షిణాది వ్యాప్తంగా మరింత పెరిగింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది.ప్రస్తుతం రుక్మిణి వసంత్ చేతిలో పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. కన్నడ స్టార్ హీరో యష్ సరసన నటిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం 2026 ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో కలిసి 'డ్రాగన్' చిత్రంలోనూ ఆమె నటిస్తున్నారు. దీంతో పాటు మలయాళ చిత్ర పరిశ్రమలోకి 'NP51' సినిమాతో అరంగేzట్రం చేయనున్నారు. తక్కువ సమయంలోనే కన్నడ నుంచి తెలుగు, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమల వరకు తన పరిధిని విస్తరించుకున్న రుక్మిణి వసంత్.. ప్రస్తుతం దక్షిణాదిలో క్రేజీ హీరోయిన్‌గా కొనసాగుతున్నారు. విభిన్నమైన కథలు, బలమైన పాత్రలతో ముందుకు సాగుతున్న ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.






## రూ.200 కోట్ల క్లబ్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్'


తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో, టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. మమితా బైజు కథానాయికగా నటించిన ఈ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించారు. విడుదలైన తర్వాత కుటుంబ ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో వసూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి.ాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు చిత్ర బృందం ప్రకటించింది. కుటుంబ ప్రేక్షకులు సినిమాను థియేటర్లలో ఆదరిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. సినిమాలోని భావోద్వేగ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. రూ.200 కోట్ల మార్క్‌ను అందుకున్నప్పటికీ సినిమా కలెక్షన్ల జోరు కొనసాగుతోందని చిత్ర యూనిట్ వెల్లడించింది.

**ఇదీ సినిమా కథ**

'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య.. సంజయ్ విశ్వనాథ్ అనే పాత్రలో కనిపిస్తారు. వ్యాపార రంగంలో బిజీగా ఉండే సంజయ్.. తన చిన్ననాటి అనుభవాల కారణంగా వివాహానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటాడు. అయితే తన తల్లి రాధికకు సంబంధించిన కొన్ని కోరికలను నెరవేర్చినప్పటికీ.. పెళ్లి విషయంలో మాత్రం ఆమెను నిరాశపరుస్తుంటాడు. తన వంశం తనతోనే ముగిసిపోతుందనే బాధ తల్లిలో ఉందని తెలుసుకున్న సంజయ్.. సరోగసీ ద్వారా ఓ బిడ్డకు తండ్రి కావాలని నిర్ణయించుకుంటాడు. అయితే ఆ తర్వాత అతడి జీవితంలో అనుకోని సమస్య ఎదురవుతుంది. చిన్నారికి అరుదైన బోన్ మ్యారో సంబంధిత వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది. చికిత్సకు తల్లి నుంచి బోన్ మ్యారో అవసరమని తెలుసుకున్న సంజయ్.. ఆ తల్లి కోసం అన్వేషణ మొదలుపెడతాడు.ఈ ప్రయాణంలో అతడికి మ్యాడీ అనే యువతి పరిచయమవుతుంది. ఈ పాత్రను మమితా బైజు పోషించారు. మ్యాడీతో కలిసి భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత సంజయ్ జీవితంలో అనేక కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. కుటుంబ బంధాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య అనుబంధం, ప్రేమ, బాధ్యత, భావోద్వేగాల చుట్టూ కథ ముందుకు సాగుతుంది.సూర్య తన పాత్రను సహజంగా పోషించడం, వెంకీ అట్లూరి కథన శైలి, కుటుంబ అనుబంధాలను తెరపై ఆవిష్కరించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన సినిమాకు బలంగా మారింది.ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. లాంగ్‌రన్‌లో మరిన్ని వసూళ్లు సాధించే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## 'టాక్సిక్'తో కియారా అద్వానీకి హిట్ వస్తుందా?

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న కియారా అద్వానీకి అవకాశాలకు కొదవలేదు. అయితే కొంతకాలంగా ఆమె ఖాతాలో భారీ కమర్షియల్ హిట్ లేదు. 2022లో వచ్చిన 'భూల్ భులయ్యా 2' తర్వాత 'జుగ్‌జుగ్ జీయో', 'సత్యప్రేమ్ కీ కథ', 'వార్ 2' చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేదు. తెలుగులో 'భరత్ అనే నేను' తర్వాత 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' కూడా ఆమెకు పెద్దగా కలిసిరాలేదు. ఇప్పుడు యష్ నటిస్తున్న 'టాక్సిక్'లో నాదియా పాత్రలో కియారా కనిపించనున్నారు. ఈ క్యారెక్టర్ తన కెరీర్‌లోనే భిన్నమైనదని ఆమె చెప్పినట్లు సమాచారం. సినిమాలో గ్లామర్‌తో పాటు పాత్రకు డార్క్ షేడ్స్ కూడా ఉన్నట్లు ప్రచార కంటెంట్ ద్వారా తెలుస్తోంది.వ్యక్తిగత జీవితంలోనూ కియారాకు ఇటీవల మార్పులు వచ్చాయి. సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న ఆమె.. 2025లో తల్లిగా మారారు. అయినప్పటికీ సినిమాలకు దూరం కాకుండా కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా హీరోయిన్లకు భారీ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కియారా కూడా అదే దారిలో ముందుకు సాగుతున్నారు.యష్ సినిమా కావడంతో 'టాక్సిక్'కు భారీ ఓపెనింగ్ రావడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. అయితే నాదియా పాత్ర కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటే.. ఈ సినిమా కియారా కెరీర్‌కు మరో బలమైన విజయంగా నిలిచే అవకాశం ఉంది.



## నిత్యామీనన్ పెళ్లిపై జోరుగా ప్రచారం

దక్షిణాది సినీ పరిశ్రమలో తన సహజ నటన, విభిన్నమైన పాత్రల ఎంపికతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నిత్యామీనన్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా ఆమె పెళ్లిపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో.. తాజాగా నిత్యామీనన్ వివాహానికి సిద్ధమయ్యారంటూ ప్రచారం జరుగుతోంది.సినిమాలతో ఇంతకాలం బిజీగా ఉన్న నిత్యామీనన్.. ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోనూ ఓ కొత్త అడుగు వేయాలని నిర్ణయించుకున్నట్లు కొన్ని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులు కూడా నిత్యకు తగిన జీవిత భాగస్వామిని వెతికే ప్రయత్నాలు ప్రారంభించారని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు నిత్యామీనన్ కానీ, ఆమె కుటుంబ సభ్యులు కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

**తల్లిదండ్రుల చేతుల్లో బాధ్యత?**

నిత్యామీనన్ జీవిత భాగస్వామి ఎంపిక విషయంలో కుటుంబ సభ్యులు కొన్ని విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కులం, మతం వంటి అంశాల కంటే వ్యక్తి స్వభావం, ఆలోచనా విధానం, మంచి మనసు, పరస్పర అవగాహన ముఖ్యమనే అభిప్రాయంతో సంబంధాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఇవన్నీ ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు, ఊహాగానాలే తప్ప అధికారికంగా ధృవీకరించబడలేదు.ఇప్పటివరకు నిత్యామీనన్ వ్యక్తిగత జీవితంపై పెద్దగా గాసిప్స్ కూడా కనిపించలేదు. కెరీర్‌లో పలువురు హీరోలతో కలిసి నటించినప్పటికీ.. ఫలానా నటుడితో ప్రేమలో ఉన్నారనే వార్తలు కానీ, డేటింగ్ చేస్తున్నారనే ప్రచారం కానీ పెద్దగా తెరపైకి రాలేదు. నిత్య కూడా తన వ్యక్తిగత జీవితాన్ని మీడియా దృష్టికి దూరంగా ఉంచుతూ వస్తున్నారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034